క్లుప్తంగా

ముందస్తు అరెస్టులు



మిడ్జిల్: జడ్చర్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ సభ సందర్భంగా బుధవారం మండలంలోని యూత్ కాంగ్రెస్ నాయకులను మిడ్జిల్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, శ్రీశైలం , లాలు, నరేందర్‌గౌడ్, సంజునాయక్, శివ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు భేష్



మహమ్మదాబాద్/గండీడ్: కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రజలను ఆదరించేలా.. ఆదుకునేలా ఉన్నాయని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి తెలిపారు. నంచర్ల గేట్‌లో బుధవారం గండీడ్, మహమ్మదాబాద్ మండలాల కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బంగారు తెలంగాణ బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ మాటలు ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకువద్దామని అన్నారు. ఈసందర్భంగా వివిధ గ్రామాల వారు బీఆర్‌ఎస్‌లో చేరారు. జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ మాధవి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

చిన్నచింతకుంట: డ్రీమ్ ఫోర్స్ ఫౌండేషన్ వారు ఈనెల 15న జిల్లా కేంద్రంలో నిర్వహించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సైన్స్ ల్యాబ్ రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ఉంద్యాలకు చెందిన విద్యార్థిని అఖిల మొదటి స్థానం సాధించింది. బుధవారం గ్రామస్తులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్థికసాయం

మహమ్మదాబాద్: బోట్లగడ్డతండాకు చెందిన మోహన్ అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా బుధవారం ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే తనయుడు రితిక్‌రెడ్డి పరామర్శించారు. అంత్యక్రియలకు రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. మాజీ ఎంపీపీ శాంతీబాయి, మాజీ సర్పంచ్ మేగిలిబాయి తదితరులు ఉన్నారు.

మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



జడ్చర్ల సాయినగర్‌లో రూ.2లక్షల నగదుతో అమ్మవారి మండపం అలంకరణ



జానంపేటలో..



రాచాలలో ..



పర్వతాపూర్ మైసమ్మ



లక్ష్మీపల్లిలో..



అమిస్తాపూర్ సాక్షి గణపతి ఆలయంలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి.

జిల్లా కేంద్రంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచముఖికాలనీలోగల ఆంజనేయస్వామి ఆలయంలో నవరాత్రి వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్‌ను అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించారు. అధ్యక్షుడు సుధాకర్, సభ్యులు పాల్గొన్నారు. బ్రాహ్మణవాడీలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని గాయత్రిదేవీ రూపంలో అలంకరించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్వర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుండ వెంకటేశ్, మిర్యాల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్రలోని పోచమ్మ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన దుర్గమ్మను బుధవారం మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. దేవరకద్రలోని వాసవీమాత ఆలయం, దళితవాడ, బల్సుపల్లిలోనూ వేడుకలు కొనసాగుతున్నాయి. లక్ష్మీపల్లిలో కనకదుర్గా ఆలయంలో బుధవారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

భూత్పూర్ పరిధిలో బుధవారం లలితాదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చింది. భూత్పూర్‌లో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి పూజారి మంజునాథ, అమిస్తాపూర్‌లోని సాక్షి గణపతి ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి పూజారి రవిశంకర్ ఆధ్వర్యంలో నిత్యం కుంకుమార్చన పూజలు చేస్తున్నారు.

జడ్చర్లలో ఉత్సవాలు బుధవారం అట్టహాసంగా కొనసాగాయి. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉత్సవాల్లో బుధవారం గణేష్ మందిరం నుంచి 108మంది మహిళలు కలశాలను ఊరేగింపుగా తీసుకు వచ్చి అభిషేకం చేయించారు. వాసవీమాత ఉత్సవ విగ్రహానికి తులాభారం నిర్వహించారు. అమ్మవారిని బుధవారం అన్నపూర్ణగా కొలిచారు. ఆయా మండపాల్లో అమ్మవారు మహాలక్ష్మి, లలితాత్రిపురసుందరి దేవిగా పూజలు అందుకున్నారు. సాయినగర్ సకలదేవతల ఆలయంలో మహాలక్ష్మిగా అలంకరించారు. రూ.2లక్షల నగదుతో అలంకరణ చేశారు.

శ్రీగిరిక్షేత్రంలో చండీహోమం కొనసాగింది.

అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని గ్రామాల్లో దుర్గామాతను బుధవారం భక్తులు ధనలక్ష్మి అవతారంలో అలంకరించి పూజలు చేశారు. మూసాపేట, జానంపేటలో అమ్మవారి మండపాల వద్ద అన్నదానం చేశారు.

నవాబుపేట మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారు శాకాంభరి దేవిగా బుధవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, ఈఓ మధనేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.



జడ్చర్లలో కలశాలతో ఊరేగింపు



జడ్చర్లలో తులాభారం



జిల్లాకేంద్రంలో వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి



జిల్లాకేంద్రంలో అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన



బాలానగర్: మండల పరిధిలోని తిరుమలగిరి, చిన్నరేవల్లి, పోచమ్మగడ్డ తండాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను మంగళవారం ఎంపీడీఓ కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ర్యాంప్‌లను పరిశీలించిన ఆయన.. వివిధ అంశాలపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు సూచనలు చేశారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు



అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలను ముమ్మరంగా చేపడుతున్నారు. టోల్‌ప్లాజా వద్ద కొత్తకోట వైపు నుంచి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్లు, ఇతర వాహనాలను నిలిపి సోదాలు చేస్తున్నారు. అక్రమంగా డబ్బు, మద్యం రవాణాపై నిఘా పెంచినట్లు వివరించారు. ఎస్‌ఐలు మాధవరెడ్డి, కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో మూసపేట, అడ్డాకుల మండలాల్లో తనిఖీలు సాగుతున్నాయి.

దేశం గర్వించే రీతిలో పథకాలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్రంలో దేశం గర్వించదగ్గ రీతిలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం ఫాం హౌస్‌లో పట్టణంలోని 23వ వార్డు, జిల్లా కేంద్రంలోని బండ్లగేరి, మునిమోక్షం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు వర్ధభాస్కర్, నవకాంత్, పురుషోత్తం, కిషన్, సర్పంచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

బాలానగర్: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మండల కేంద్రం మీదుగా హైదరాబాద్ వైపు జాతీయ రహదారిపై ఓ కారులో తరలిస్తున్న సుమారు 20 లీటర్ల మద్యం బాటిళ్లను బుధవారం స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

సభకు తరలిన నాయకులు



రాజాపూర్: జడ్చర్లలో జరిగిన బీఆర్‌ఎస్ ఆశీర్వాద సభకు బుధవారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి యువకులు, నాయకులు భారీగా తరలివెళ్లారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బచ్చిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డితో పాటు నాయకులు ప్రజలను తరలించారు.

ఉడిత్యాలకు చెందిన శ్రీధర్‌గౌడ్ గ్రామం నుంచి నాలుగు వందల మంది యువకులతో పింక్ కలర్ షర్ట్‌లను ధరించి బైక్‌లపై జడ్చర్ల వరకు ర్యాలీగా వచ్చి ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎంపీటీసీ అభిమన్యూరెడ్డి ఆధ్వర్యంలోనూ యువకులు సభకు తరలివెళ్లారు.

మిడ్జిల్: మండలం నుంచి తరలివెళ్లిన వారిలో ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖ, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పాండుయాదవ్, నాయకులు ఉన్నారు.

నవాబుపేట: జడ్చర్లలో బుధవారం జరిగిన ముఖ్యమంత్రి బహిరంగ సభకు నవాబుపేట మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి బస్సులలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు నర్సింలు, జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.



ముమ్మరంగా బీఆర్‌ఎస్ ప్రచారం



భూత్పూర్ పరిధిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆల మంజుల



చిన్నచింతకుంటలో..

సాక్షినెట్‌వర్క్: సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి మంజుల అన్నారు. బుధవారం భూత్పూర్ మున్సిపాలిటీలోని వాల్యాతండా, అమృతండా, మీత్యాతండా, బొట్లగడ్డతండా తదితర చోట్ల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ గౌడ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని గ్రామాల్లో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి బుధవారం మద్దిగట్లలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు. గుడిబండలో రైతు సమితి అధ్యక్షుడు కొండారెడ్డి, సర్పంచ్ జ్యోతి, వెంకటాయపల్లిలో సర్పంచ్ సక్కరి అంజనేయులు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

చిన్నచింతకుంట మండంలోని వివిధ గ్రామాలల్లో బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ ఉషారాణి, మండల అధ్యక్షుడు కోటరాము ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. చిన్నచింతకుంటలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. యాకూబ్, కురుమూర్తి దేవస్థానం చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో వేడుకలు



జిల్లాకేంద్రంలో.. బీజేపీ మహిళా నేతలు



అడ్డాకులలో బతుకమ్మలతో విద్యార్థినులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం ఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ కౌసర్‌జహాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి అనంతరం కేఎల్ఐ కాల్వలో నిమజ్జనం చేశారు. ప్రిన్సిపాల్ వెంకటయ్య, చరణ్, స్వగ్నేష్, రమేష్, కరన్‌జీ, సునీత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. రకరకాల పూలతో అలంకరించిన బతుకమ్మలను కళాశాల ఆవరణలో ఉంచి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజన్‌కుమార్, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో బుధవారం పలు చోట్ల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహించిన వేడుకల్లో మేనేజర్ సుజాత, ఉద్యోగులు పాల్గొన్నారు. అదే విధంగా వీరశైవలింగాయత్, లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వీరన్నపేటలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.

పాలమూరు: బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పార్టీ కార్యాలయం దగ్గర బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళలు అందరూ వివిధ రకాల పువ్వులతో బతుకమ్మలను తయారు చేశారు. ఆనందంగా బతుకమ్మ ఆడారు. జిల్లా అధ్యక్షురాలు పద్మవేణమ్మ, యాదమ్మ, కాశేశ్వరమ్మ, పుష్పలత, నిరంజనమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



మిడ్జిల్‌లో..



జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోలో బతుకమ్మ వేడుకలు

‘ప్రవల్లికది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే’



మాట్లాడుతున్న రమేశ్

స్టేషన్ మహబూబ్‌నగర్: గ్రూప్–2 వాయిదా వేయడంతో ఆత్మహత్యకు పాల్పడిన ప్రవల్లికది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రవల్లిక గ్రూప్–2కు అప్లై చేసుకోలేదని, ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారం కారణమని పోలీసులు చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రేమ వ్యవహారం కారణమని ఆమె వ్యక్తిత్వంపై మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శివజోగి, జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్, అసెంబ్లీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మణిరత్నం, పట్టణ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే పథకాల అమలు



షాసాబ్‌గుట్టలో ప్రచారం నిర్వహిస్తున్న యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



కొకుంట్లలో కాంగ్రెస్ ప్రచారం

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం షాసాబ్‌గుట్ట 41వ వార్డులో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ ఆధ్వర్యంలో బుధవారం ఆరు గ్యారంటీ పథకాల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడుందని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారని, బీసీలపైనే కేసులు ఉన్నాయన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, నాయకులు బెక్కరి అనిత, సీజే బెనహర్, సాయిబాబా, లింగంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అమరేందర్‌రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని 5, 7, 8, 9, 35, 37 వార్డుల నుంచి వివిధ పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వారికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రాధా అమర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: కొకుంట్ల మండల కేంద్రంలో బుధవారం గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం సాగింది. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, ఓబీసీ మండల కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై పోలీసుల నజర్

- గ్రామాల్లో ముమ్మరంగా సోదాలు
- పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరిక
- గంజాయి సరఫరా పైనా పోలీసుల నిఘా



పట్టుబడిన మద్యం(ఫైల్)

అడ్డాకుల: బెల్టుషాపుల్లో పోలీసుల సోదాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలైన తర్వాత పోలీసులు క్రమేపీ బెల్టుషాపుల్లో తనిఖీలను పెంచారు. కాగా ఎన్నికల కోడ్ కంటే ముందు బెల్టుషాపులపై స్థానికులు ఫిర్యాదు చేసినా సివిల్ పోలీసులు వాటి జోలికి వెళ్లేవారు కాదని పలువురు అంటున్నారు. ఇదిలా ఉంటే మద్యం షాపులకు వచ్చే స్టాక్‌లో సగానికి పైగా బెల్టుషాపులకు వెళ్లేది. మద్యం అమ్మకాల టార్గెట్ పూర్తి కావడానికి అప్పట్లో ఎక్కువ మద్యాన్ని బెల్టుషాపులకే విక్రయించే వారు. దీనికి ఎక్సైజ్ పోలీసులు కూడా సహకరించే వారనే వాదనలు లేకపోలేదు. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమలవడంతో అంతా తారుమారైందని చెబుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సివిల్ పోలీసులు బెల్టుషాపుల్లో తనిఖీలను పెంచారు. ప్రతి రోజు గ్రామాల్లోని రెండు, మూడు బెల్టుషాపుల్లో మద్యాన్ని గుర్తించి పట్టుకుంటున్నారు. షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నారు. బెల్టుషాపుల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఇటీవల అడ్డాకుల పోలీసులు గంజాయి విక్రయాలపై నజర్ వేసి ఇద్దరు నిందితులను పట్టుకుని కేసు నమోదు చేశారు. గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు సాగేందుకు తగిన చర్యలు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా ఇంకా గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వాహకులు మద్యం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇతరుల ఇళ్ల వద్ద మద్యాన్ని నిల్వ చేసి విక్రయాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

సమాచారం ఇవ్వాలి



బెల్టుషాపుల్లో ప్రతి రోజు తనిఖీలు చేస్తున్నాం. ఇప్పటి వరకు 8 దుకాణాలపై కేసులు నమోదు చేశాం. ఇటీవల గంజాయి విక్రయాలను అడ్డుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశాం. గ్రామాల్లో ఎవరైనా మద్యం అమ్మితే మాకు సమాచారం ఇవ్వాలి. బెల్టుషాపుల్లో మద్యం అమ్మినా, బహిరంగంగా మద్యం తాగినా కేసులు తప్పవు.

–మాధవరెడ్డి, అడ్డాకుల ఎస్‌ఐ